క్లుప్తంగా

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైర్మల్‌వీధిలో వెలసిన శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హుండీ సొమ్ము చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల మండలం పుసులూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వేకువజామున గుర్తుతెలియని దొంగలు హుండీలో డబ్బులు తస్కరించారు. తాలుకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో కొత్తగా వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో వేకువజామున గుర్తుతెలియని దొంగలు ప్రవేశించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: మద్యానికి బానిసైన ఓ యువకుడు అలవాటు మానుకోలేక మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కర్ణమయ్య వీధికి చెందిన వెంకటేశ్వర్‌గౌడ్ (22) కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసగా మారాడు. కుటుంబ సభ్యులు ఎంత నచ్చచెప్పినా మానకపోవడంతో కుటుంబంలో తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో సోమవారం పూటుగా మద్యం సేవించిన వెంకటేశ్వర్‌గౌడ్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే సరికే విగతజీవిగా వేలాడుతుండటంతో కిందకు దించారు. మృతుడి తల్లి నీలావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

కృష్ణా జలాలకు విశేష పూజలు



కృష్ణా జలాల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వర ఆలయం

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం సమీపంలోని సప్తనదుల సంగమ ప్రాంతంలో కృష్ణాజలాలకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ నిజశ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. వరుణుడి అనుగ్రహం కోసం విశేష పూజా కార్యక్రమాలు, రుద్ర వరుణ, అరుణ పారాయణం, వరుణ జపం, వరుణ సంకల్ప పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీశైల జలాశయం పూర్తిస్థాయిలో నిండి ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. శ్రీశైల జలాశయం 885 అడుగుల నుంచి 850.80 అడుగులకు చేరుకుంది. దీంతో ఆలయ మండపభాగం బయటపడుతోంది.

తెలంగాణ మరబోటు సీజ్

కొత్తపల్లి: తెలంగాణ– ఆంధ్రా రాష్ట్రాల మధ్య కృష్ణానదిపై అనుమతులు లేకుండా తిరుగుతున్న ఓ తెలంగాణ మరబోటును సీజ్‌చేసి ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ హుస్సేన్ బాషా సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం కొల్లాపుర్ మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన శంకర్, ముక్కురగుండంకు చెందిన మల్లయ్యలు అవతలి ఒడ్డు నుంచి ఆంధ్రా ఒడ్డుకు మరబోటులో ప్రజారవాణా చేస్తున్నారని తెలిపారు. సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలసి దాడులు చేసి తెలంగాణ నుంచి ఇవతలి గట్టుకు ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు లేకుండా వస్తున్న బోటును సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

మహానందిని వదలని ఎలుగుబంటి

మహానంది: మూడురోజులుగా సంచరిస్తున్న ఎలుగుబంటి సోమవారం తెల్లవారుజామున మళ్లీ టోల్‌గేట్ ఎదురుగా ఉన్న పొలాల్లో కనిపించింది. వేకువన రెండు గంటల సమయంలో టోల్‌గేట్ పరిసరాల నుంచి పెట్రోల్‌బంక్ వెనుకవైపు మార్గం ద్వారా తెలుగుగంగ కట్టవైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మహానందీశ్వర స్వామి దర్శనం వేకువ నుంచే ప్రారంభమవుతుంది. దీంతో ఆలయ సిబ్బంది, అర్చకులు తెల్లవారుజామున 3.30గంటల నుంచే వెళ్లాల్సి ఉంది. అయితే ఎలుగుబంటి సంచారంతో భయంభయంతో విధులకు వెళ్తున్నారు. ఇందిలా ఉండగా ఎలుగు బంటి సంచారంపై పత్రికల్లో, టీవీల్లో వార్తలు రావడంతో అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్‌సరఫరాకు అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. తీగలు తెగిపడి ఉంటే వాటిని తాకవద్దన్నారు.



దొర్నిపాడు వద్ద.. వర్షం రాకతో ప్రాణం పోసుకున్న మిరప పైరు



కుందూ కింద పచ్చగా కళకళలాడుతున్న వరి పంట

వర్షించిన మేఘం.. పరవశించిన పైర్లు

- పత్తి, మిరప పంటలకు ఊపిరి పోసిన వాన
- కళకళలాడుతున్న పంటలు

దొర్నిపాడు: దాదాపు నెలకు పైగా మేఘం ముఖం చాటేసింది. అయినా పొలాల్లో ఉన్న రైతన్న మదిలో ఆశలు చావలేదు. చివరకు భారమంతా దేవుడిపైనే వేసి ఆదుకోవాలని వేడుకున్నాడు. మొర ఆలకించాడేమో.. అన్నదాత కష్టం చూడలేక ఆయనే వరుణుడిని పురమాయించాడు. అంతే రెండు రోజులుగా భారీ వర్షం కురిసింది. ఇప్పటి వరకు చినుకులేక నోళ్లు తెరిచిన పొలాల్లో ఎంత నీరు పోసినా చాలవన్నట్లుగా ఉన్న భూముల్లో ఒక్క రాత్రి కురిసిన వానకే పంటలు మునిగిపోయేంతలా వర్షపునీరు నిలిచిపోయింది. ఇక వాగులు, వంకలు, చెరువులు నిండి పొంగిప్రవహించాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం,

వర్షపాతం వివరాలు..

మండలం	3వ తేదీన (మి.మీ)	4వ తేదీన (మి.మీ)
ఆళ్లగడ్డ	67.4	1.4
చాగలమర్రి	102.0	0.0
దొర్నిపాడు	79.4	3.6
రుద్రవరం	43.2	12.2
శిరివెళ్ల	34.2	27.8
ఉయ్యాలవాడ	100.2	1.8

సోమవారం వరకు వర్షం కరవడంతో పంటలు జీవం పోసుకున్నాయి. ఖరీఫ్‌లో భాగంగా అరకొరగా కురిసిన వర్షాలకు మండలంలో పత్తి, మిరప, మినుము తదితర పంటలు 3,437 హెక్టార్లలో సాగు చేశారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి, మిరప నాట్లు వేసేందుకు రైతులు చర్యలు ముమ్మరం చేశారు.

రుద్రవరం: మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. మొన్నటి వరకు చినుకు జాడ లేక వాగులు వంకలు నీరు లేక వెలవెలబోయేవి. అయితే రెండు రోజులుగా వర్షం విడతలు విడతలుగా కురుస్తుండటంతో మండలంలోని పలు గ్రామాల సమీపంలోనున్న వాగులు వంకలు జలకళను సంతరించుకున్నాయి. వర్షపునీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మినుము,మొక్కజొన్న,వరి తదితర పంటలు కళకళలాడుతున్నాయి.

మండలంలో ఖరీఫ్‌లో భాగంగా సాగుచేసిన పంటల వివరాలు

పంటలు	సాగుచేసిన విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	1,252
జొన్న	46
కొర్ర	14
కంది	86
మినుము	525
వేరుశనగ	19
సోయాబీన్	16
మిరప	277
పత్తి	1,065
కూరగాయలు	67
మొత్తం	3,437

పంటలకు కళ వచ్చింది



వర్షం లేక రైతులు ఇబ్బందులు పడేవారు. గత రెండు రోజుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ఊరటనిచ్చాయి. ఎండు దశకు చేరుకున్న పైర్లు కురుస్తున్న వర్షాలకు పచ్చదనం పులుముకున్నాయి. ముఖ్యంగా మండలంలో వరి, మిరప, పత్తి పంటలను అధికంగా సాగు చేశారు. అలాగే రబీలో సాగుచేయనున్న శనగ పంటకు కూడా మంచిదే. ఎందుకంటే పంట సాగుకు నెల రోజుల ముందు నేలలో రసాయన ఎరువులను వేయాలి. జలాశయాలు నిండితే కుందూ, కేసీలకు నీరు పుష్కలంగా వస్తుంది.

– సునీత, మండలవ్యవసాయాధికారి, దొర్నిపాడు



ముత్తలూరు వద్ద వాగులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

నంద్యాలలో హైకోర్టు జడ్జి



జడ్జీకి బొకే అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల(వ్యవసాయం): హైకోర్టు జడ్జి డీవీఎస్ఎస్ సోమయాజులు సోమవారం జిల్లాలో పర్యటించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే స్థానిక బార్ అసోసియేషన్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, రఘుప్రకాష్, ప్రతాపరెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 26 వార్డులో ఇటీవల షేక్ కుర్షులైన్ మృతి చెందడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయంగారూ.10వేలు మృతురాలు కుమారుడు అబ్దుల్‌రహిమాన్‌కు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ సోమవారం అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మనోహర్, వలంటీర్ జానకీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

రుద్రవరం: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసోత్సవంలో భాగంగా సోమవారం గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఆకు కూరలు,కూరగాయలు,పండ్లు వంటి వాటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటినట్లు నంద్యాల జిల్లా స్పిర్ట్స్ కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షిహాన్‌సైక్ నూర్‌బాషా సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన కర్నూలులో 11వ నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే చాపింయన్‌షిప్ పోటీలు ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో జరిగాయన్నారు. ఇందులో నంద్యాల జిల్లాకు చెందిన కరాటే విద్యార్థులు పాల్గొని మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందారు. ఆరెంజ్ బెల్ట్ 4, 5 సంవత్సరాల్లోపు కుమితే విభాగంలో కేఎండీ అహన్ బ్రాంజ్, బంగారు మెడల్స్, ఆరెంజ్ బెల్ట్ 6-7 సంవత్సరాల్లోపు 25 కేజీల వెయిట్ కేటగిరీలో కేఎండీ మ్యాథిన్ బ్రాంజ్ గోల్డ్, గ్రీన్‌బెల్ట్, 10, 11 సంవత్సరాల్లోపు 27 అండ్ 25 కేజీ వైట్ కేటగిరి కేఎండీ జునైత్, జి.హరిఫ్‌బాషా, బ్రాంజ్, గోల్డ్ మెడల్స్ 4, ఎల్లో బెల్ట్ 12, 13 సంవత్సరాల్లోపు 30-40 కేజీ వెయిట్ కేటగిరిలో శ్రీరామ్, నిరంజన్ బ్రాంజ్, సిల్వర్ 5, గ్రీన్ బెల్ట్ 14 సంవత్సరాల్లోపు 40-48 కేజీల వెయిట్ కేటగిరి విభాగంలో మనిదీప్, జి.వర్షిత్ కుమార్ బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ 7, బ్లాక్ బెల్ట్ 11 సంవత్సరాల్లోపు వారు 30 కేజీల వెయిట్ కేటగిరిలో రెండు బంగారు పతకాలు సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులకు జీకేఎం వ్యవస్థాపకులు ప్రేమ్‌కట్కా, చీఫ్ కోచ్ హారిఫ్‌హుసేన్, పీజే కుమార్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారని వివరించారు.



ప్రతిభ చూపిన క్రీడాకారులు

విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయం



పాఠశాలలో మినరల్ వాటర్ నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల: విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయంగా పని చేస్తున్నామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ స్కూల్ నోడల్ ఆఫీసర్ కాంతారావు తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హెల్త్ కార్డులు, మినరల్ వాటర్ నాణ్యతను పరిశీలించారు. నీటి నాణ్యత సాధారణ స్థాయిలో ఉండేటట్లు ప్రతి 15 రోజులకొకసారి వాటర్ క్యాలిటీ టెస్ట్ చేయించాలని సూచించారు. అనంతరం 3వ గ్రామ సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ కాన్సెప్ట్‌ను తనిఖీ చేశారు. ఎంత మంది ఓపీకి వస్తున్నారు, ఎన్ని ఇళ్లను సందర్శించి వైద్య పరీక్షలు చేస్తున్నారని ఆరా తీశారు. పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న సేవలు,టీకాల కార్యక్రమంపై డాక్టర్ విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ శ్రీమంత్, సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మరిన్ని కొత్త పింఛన్లు మంజూరు

శిరివెళ్ల: మండలానికి కొత్తగా మరో 192 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. శిరివెళ్లకు 64, గోవిందపల్లె 22, యర్రగుంట్ల 24, మహదేవపురం 17, జీనేపల్లెకు 4, గుంప్రమాన్‌దిన్నెకు 7, చెన్నూరు 15, గంగవరం 6, బోయలకుంట్లకు 7, గుండంపాడు 6, కోటపాడుకు 20 పింఛన్లు విడుదలయ్యాయని చెప్పారు. మొదటి విడతలో 153 పింఛన్లు మంజూరు కాగా 2వ విడతలో 192 మొత్తం 345 పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు.

చాగలమర్రి: మండలానికి 387 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ షేక్ మహబూబ్ దౌలా శనివారం తెలిపారు. నూతన లబ్ధిదారులకు ఇప్పటికే పింఛన్ సొమ్ము అందజేశామన్నారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో 6వ వార్డు అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన అచ్చుకట్ల మహబూబ్ షరీఫ్ తల్లి అచ్చుకట్ల మాబుచాన్‌కు వితంతు పెన్షన్‌ను సర్పంచ్ తులసమ్మ, వార్డు మెంబర్ డి.మన్సూర్ పింఛన్ అందజేశారు. అలాగే అనారోగ్యంతో చికిత్స పొందేందుకు కడప పట్టణంలోని తన కుమారుని ఇంట్లో ఉంటున్న ఆవులపల్లె గ్రామానికి చెందిన సి.రవణమ్మకు వలంటీర్ సుధాకర్ అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశాడు. చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 5 సచివాలయాలకు కలిపి 149 మందికి, చిన్న వంగలి -20, చితలచెరువు-18, డి.వి.పెంటకు -20, గోడిగనూరుకు-18, మద్దూరు-20, మల్లెవేముల-23, ముత్యాలపాడు 1వ సచివాలయానికి-23, 2వ సచివాలయానికి-21, నేలంపాడు-16, పెద్దవంగలి-17, పెద్ద బోధనం-24, శెట్టివీడు-18 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. మొత్తం 387 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయి.



కడపలో రవణమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సుధాకర్

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలి

డోన్ టౌన్: ప్రజల్లో మూఢ నమ్మకాలు పారద్రోలి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పరిశీలకులు ఖాజా హుస్సేన్ సూచించారు. పట్టణంలో జరుగుతున్న సంఘం మహా సభలకు రెండో రోజు సోమవారం ఆయన హాజరై మాట్లాడారు. ఆధునిక సమాజంలో పెరుగుతున్న సాంకేతికతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు మూఢ నమ్మకాలకు అధికంగా నష్ట పోతున్నారని వీరిని జాగృతం చేయాలన్నారు.

నూతన కమిటీ..

జన విజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జనార్దన్, జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా రామరాజు, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ లతీఫ్, గురుస్వామి, ప్రధాన కార్యదర్శిగా డోన్ మాణిక్యం శెట్టి, కోశాధికారిగా పునీత్‌కుమార్, జిల్లా కార్యదర్శులుగా సర్వజ్ఞమూర్తి, శ్రీనివాసబాబు, రామమూర్తి, గోపాల్, సమత, కన్వీనర్‌గా లక్ష్మీదేవి, యూత్ కమిటీ సభ్యుడిగా చిన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రిజిస్ట్రేషన్ సేవలపై శిక్షణ

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని మిట్టపల్లి, తమ్మడపల్లె, యనకండ్ల గ్రామ సచివాయాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలపై సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్తా శిక్షణ ఇచ్చారు. భూముల కొనుగోలుదారులు, అమ్మకందారుల వద్ద నుంచి తీసుకోవాల్సిన డాక్యుమెంట్లు, పరిశీలన, ఆన్‌లైన్ విధానం తదితర అంశాలను కంప్యూటర్ ద్వారా వివరించారు.

మద్దిలేటి స్వామికి కంఠాభరణం బహూకరణ

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వే కాలనీకి చెందిన రామసుబ్బరావు దంపతులు రూ.లక్ష విలువచేసే వెండి కంఠాభరణం విరాళమిచ్చారు. ఆభరణాన్ని ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడుకు సోమవారం అందజేశారు. దాతలను స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

జీతం పెంచి.. సంతోషం నింపి

- సెర్ప్ ఉద్యోగులకు ఈ నెల నుంచి బేసిక్‌పై 23 శాతం పెంపు
- జిల్లాలో 176 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో పనిచేసే గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా జీతాలు పెంచింది. దీంతో ఉద్యోగుల్లో సంతోషాన్ని నింపింది. సెర్ప్ పరిధిలో వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేసే ఈ ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ల ఉన్నతికి విశేషంగా కృషి చేస్తున్నారు. అయితే పనికి తగిన జీతం రావడం లేదని వీరు కొన్నేళ్లుగా ప్రభుత్వాలను కోరుతూ వచ్చారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీరి బేసిక్ జీతంపై ఏకంగా 23 శాతం పెంచుతూ జీవో 64ను విడుదల చేసింది. పెరిగిన ఈ జీతం ఆగస్టు ఒకటి నుంచి వర్తింపజేస్తున్నట్లు జీవోలో పేర్కొంది. దీంతో ఈనెలలో వచ్చే జీతం పెరుగుతుండడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా డీఆర్‌డీఏ-వెలుగు క్రాంతి పథంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల అభివృద్ధిలో సెర్ప్ పరిధిలో పనిచేసే ఉద్యోగులు కీలకంగా ఉన్నారు. వారిలో డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం), అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం), కమ్యూనిటీ కో ఆర్డినేటర్ (సీసీ)లు, అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ) ఉన్నారు. వీరిలో చాలా మంది 2002 నుంచి పని చేస్తున్నారు. వాణిజ్య బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు వాయిదాలు కట్టించడం, స్త్రీనిధి కింద బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వడం, ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు చేసే వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం)-1, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు ఇద్దరు, అసిస్టెంట్లు ప్రాజెక్టు మేనేజర్లు 33, క్లస్టర్ కో ఆర్డినేటర్లు 135, అడ్మిన్ అసిస్టెంట్లు 5మందికి చొప్పున మొత్తం 176 మందికి జీతాలు పెరిగాయి. ప్రాజెక్ట్ మేనేజర్‌కు బేసిక్ జీతం రూ.4వేల నుంచి రూ.12వేల వరకు పెరిగింది.

ఉద్యోగుల ఆనందోత్సవాలు..

వేతన పెంపును ప్రభుత్వం ప్రకటించిన తరువాత క్షేత్రస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు సెర్ప్ ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. ఏళ్ల తరబడి ఉద్యమాలు చేసినా ఏ ప్రభుత్వం స్పందించలేదని, పాదయాత్రలో హామీ ఇవ్వకపోయినా సమస్య తెలుసుకుని వేతనాలను భారీగా పెంచినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

సిబ్బంది కుటుంబాల్లో వెలుగులు



వేతనాలు పెంచకపోవడం వల్ల కొన్నేళ్లుగా ఇబ్బంది పడ్డాం. సమస్యను వివరించినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రస్తుతం డిమాండ్ చేయకపోయినా మా విధుల ప్రాధ్యాన్యతను గుర్తించి 23 శాతం జీతం పెంచడం ఆనందంగా ఉంది. దీనివల్ల కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. ఉత్సాహంగా పనిచేయడానికి ఇదొక అవకాశం, ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్ధిదారుడికీ చేర్చేందుకు మరింత కృషి చేస్తాం. సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– దానం, డీపీఎం ఏరియా కో ఆర్డినేటర్, నంద్యాల

సీఎంకు రుణపడి ఉంటాం



సెర్ప్ పరిధిలో వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏకంగా బేసిక్ మీద 23 శాతం జీతం పెంచడం హర్షణీయం. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం చాలా సంతోషాన్ని ఇచ్చింది. అన్ని కేటగిరి ఉద్యోగుల వేతనాలు పెంచడం సంతోషదాయకం. ఆయనకు రుణపడి ఉంటాం.

–ఎల్లయ్య, ఏపీఎం, నంద్యాల

తగ్గుముఖం పట్టిన విష జ్వరాలు

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో విష జ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయిన వైద్యాధికారులు సౌజన్య, జబ్బీర్ తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి గ్రామంలో ప్రబలిన విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు వైద్యులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి శతవిధాలా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక వైద్యశాల ఆధ్వర్యంలో ఎర్రమఠం గ్రామంలో, చెంచుగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామంలోని కాలనీలతో పాటు చెంచుగూడెంలో ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై మాట్లాడి రక్త పరీక్షలు చేశామన్నారు.



ఎర్రమఠంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అలరించిన శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్‌బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మూడు నుంచి 8సంవత్సరాల్లోపు పిల్లలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.2వేలు, రెండవ విభాగంలో 9 నుంచి 15సంవత్సరాల్లోపు పిల్లలకు మొదటి బహుమతి రూ.7500, రెండో బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.3వేలు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ సహదేవుడు, చిత్తలూరి రాంప్రసాద్, పత్తి రంగనాథ్ వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడు వెలుగూరి శ్రీకాంత్, సెక్రటరీ సునిల్, వైస్ ప్రెసిడెంట్ మురళీ ప్రసాద్, కృష్ణ, సుమంత్ పాల్గొన్నారు.



శ్రీకృష్ణ వేషధారణలో నృత్యం చేస్తున్న చిన్నారి

మహానందీశ్వరుడి పల్లకీసేవ రద్దు

మహానంది: శ్రావణమాసం, మూడవ సోమవారం జరగాల్సిన మహానందీశ్వరుడి పల్లకీసేవ వర్షం కారణంగా రద్దైంది. కాగా, శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు అలంకార పూజ, హారతులు చేపట్టి రాత్రి ఏకాంతసేవ పూజలు చేశారు.

శ్రీశైలంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థానం ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. లడ్డూ ప్రసాదం కౌంటర్లలో , ఆర్జిత సేవా టిక్కెట్ల స్కానింగ్ చేసే సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.